ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 26 మార్చి 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6:35
సహర్ - బుధవారం
ఉదయం - 4:53

రంగుల కేళి... హోలీ

- ఉత్సాహంగా రంగుల పండుగ
- రంగులు చల్లుకున్న చిన్నాపెద్ద
- వీధుల్లో సందడి చేసిన యువత







రంగుల పండుగ హోలీ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. చిన్నాపెద్ద, ఆడామగ తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబరాల్లో మునిగి తేలారు. ఆదివారం రాత్రి కామదహనంతో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. వీధుల్లో యువకులు రంగులతో హంగామా చేశారు. మహిళలు ఒకరిపై ఒకరు రంగునీళ్లు కుమ్మరించుకొని ఉత్సాహంగా పండుగలో పాల్గొన్నారు. శంషాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. కొన్నిచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగుల వేడుక అనంతరం మధ్యాహ్నం సమీప చెరువులు, బావుల వద్ద స్నానాలు చేసి ఇళ్లలో ప్రత్యేక వంటకాలు ఆరగించారు. సాయంత్రం కళాకారులు గ్రామాల్లో ఇల్లుల్లూ తిరిగి తమ కళాపాండిత్యాన్ని ప్రదర్శించి విరాళాలు సేకరించారు.

- న్యూస్ నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి, మార్చి 25



చౌదరిగూడలో హోలీ సంబరాల్లో చిన్నారులు



యాచారం మండలం నందివనపర్తిలో హోలీ వేడుకల్లో యువకులు



శంషాబాద్‌లో రంగు పూసుకుంటున్న మహిళలు



రంగులు చల్లుకుంటున్న బాలికలు



మహేశ్వరంలో రంగులు చల్లుకుంటున్న పిల్లలు



చేవెళ్లలో హోలీ సంబరాల్లో చిన్నారులు

కొబ్బరి బోండాలకు డిమాండ్

- బెంగళూరు, కేరళ, కోనసీమల నుంచి దిగుమతి
- రూ.60 పలుకుతున్న ధర



జోరుగా కొబ్బరి బోండాల విక్రయం

ఆమనగల్లు, మార్చి 25 : ఆమనగల్లులో కొబ్బరి బోండాల విక్రయం జోరందుకుంది. ఎండలు ముదరడంతో కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది బోండాల ధర గతం కంటే ఎక్కువైంది. మన ప్రాంతంలో కొబ్బరి తోటలు అంతగా లేకపోవడంతో వ్యాపారులు బెంగళూరు, కేరళ, ఆంధ్రలోని కోనసీమ ప్రాంతాల నుంచి బోండాలను దిగుమతి చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి తెస్తుండడంతో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భారం అవుతున్నాయి. నాణ్యతను బట్టి ఒక్కో కాయ రూ.50 నుంచి 60 వరకు విక్రయిస్తున్నారు. ధర పెరిగినా వేసవిలో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ప్రజలు కొబ్బరి నీళ్లను తాగేందుకు ఇష్టపడుతున్నారు.

కొందుర్గు ఏవో సస్పెన్షన్

కొందుర్గు, మార్చి 25 : కొందుర్గు మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌పై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారని షాద్‌నగర్ ఏడీఏ రాజరత్నం సోమవారం తెలిపారు. ఏఈవోగా విధులు నిర్వహించిన శ్రీశైలం రైతుబంధు, రైతుబీమాకు సంబంధించి రూ.2కోట్ల కుంభకోణం చేసి ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు. ఈ అవినీతిలో శాఖాపరమైన విచారణ చేసిన అధికారులు మండల వ్యవసాయ అధికారిని సైతం సస్పెండ్ చేశారు.

కరువు కాటు!

అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు

- కాపాడుకునేందుకు అన్నదాతల పాట్లు
- ట్యాంకర్లతో నీరు పారిస్తున్న వైనం
- మంచాల మండలంలో వందల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

మంచాల, మార్చి 25 : ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అన్నదాతలకు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. కాలంలో వానలు కురియక భూగర్భ జలాలు అడుగంటి పంటలెండుతున్నాయి. మంచాల మండలంలో బోరు నీటితో రబీలో వరి, కూరగాయ తదితర పంటలు సాగుచేశారు. బోర్లలో నీటిలభ్యత రోజురోజుకూ తగ్గిపోతూ నీరందక పంటలు ఎండుతున్నాయి. వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండుముఖం పడుతుండడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు చేయని ప్రయత్నాలు లేవు. పంట కాపాడుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేస్తున్నారు. కరువుతో రైతుల ప్రయత్నాలు ఫలించడం లేదు. వేస్తున్న బోర్లలో దుమ్మే రేగుతోంది కానీ నీటి జాడ కన్పించడం లేదు. దీంతో చేసేదేమీ లేక రైతులు ఎండుతున్న పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఈనుతున్న పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు ట్యాంకర్లతో నీరు తెచ్చి పారించేందు తంటాలు పడుతున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు వెయ్యిరూపాయలు వెచ్చించి భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. ఒకటి రెండు తడులతో పంట చేతికొస్తుందనే ఆశతో డబ్బులిచ్చి ట్యాంకర్లతో నీరు పారించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే రైతుల ఆశలు అడియాసలే అవుతున్నాయి. నెర్రలుబారిన పొలాల్లో ట్యాంకర్లతో ఎంత నీరు పోసినా కొంద్ర భూమైనా పారడం లేదు. దీంతో వచ్చే దిగుబడి కంటే కూడా రైతులు ఎక్కువ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మామిడి తోటలు పారించే బోర్లు సైతం ఎండడంతో చెట్లకు ట్యాంకర్లతో నీరు తెచ్చి పోస్తున్నారు. తిప్పాయిగూడలో కరువు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడ వ్యవసాయ బోర్లన్నీ వట్టిపోయి వందల ఎకరాల్లో వరి, ఇతర కూరగాయ తోటలు ఎండుతున్నాయి. ట్రాక్టర్ ట్యాంకర్లతో నీరు పోసి పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు.



తిప్పాయిగూడలో ఎండిన వరి చేను



ట్యాంకర్‌తో వరికి నీరు పెడుతున్న రైతు జెనిగె సత్తయ్య

రెండెకరాల్లో వరి వేస్తే నీరందక ఎండిపోయింది

గత రెండుమూడేండ్లు పంట బాగానే పండింది. ఈ సారి వానలు పడలేదు. యాసంగిలో రెండకరాల్లో వరిపంట వేస్తే చూస్తుండంగానే ఎండిపోతుంది. కొన్ని రోజులు ముందు నాటిన వరి ఇప్పుడు ఈనుతుంది. ఎండుతున్న చేనును చూస్తుంటే దుఃఖం నాకు వస్తుంది. కొంతైనా చేతికొస్తుందేమోనని ట్యాంకర్లతో నీరు తెచ్చి పోస్తున్న. ఇసోంటి కష్టం ఎవ్వరికీ రావొద్దు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- జెనిగె సత్తయ్య, రైతు, తిప్పాయిగూడ



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజల సహకారంతోనే శాంతియుత వాతావరణం

మహేశ్వరం, మార్చి 25 : శాంతి భద్రతల విషయంలో ప్రజల సహకారం, సహనాల వల్లే సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటొందని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సోమవారం రాత్రి మండల పరిధిలోని అమీర్‌పేటలో కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిరహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు, ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కవాతులో ఎస్సైలు రవీందర్, వెంకటరెడ్డి, ప్యారా మిలటరీ పాల్గొన్నారు.

ఎలక్షన్ వేళ

'గులాబీ'లో గుబులు

- ఒక్కొక్కరుగా కారు దిగుతున్న నేతలు
- కాంగ్రెస్, బీజేపీ వైపు బీఆర్ఎస్ శ్రేణుల చూపు



తాండూరు, మార్చి 25 : పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ నాయకులు ఒక్కొక్కరుగా కారు దిగుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలోని తాండూరు నియోజకవర్గ ఓటర్లు అన్ని పార్టీలకు ప్రధానమే. ఈ నేపథ్యంలో అధికారం కోల్పోయిన మూడు నెలలలోపే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీల గూటికి చేరుతున్నారు. తాండూరు మునిసిపాలిటీ, పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు వెంకన్న, రామకృష్ణ(రాము), సీనియర్ నాయకుడు కరుణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం అయినా పార్లమెంట్ ఎన్నికల తర్వాత చేర్చుకుంటామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చినట్లు సమాచారం. తాజాగా సోమవారం యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా బీజేపీలో చేరారు. తాండూరు నియోజవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణులు పాలక కాంగ్రెస్, బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం అయోమయంలో పడింది. ఓడిపోయి డీలాపడ్డ బీఆర్ఎస్ గత మూడు నెలలుగా పెద్దగా కార్యక్రమాలేవీ చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కోలుకోని ఆ పార్టీకి ప్రజాప్రతినిధులు, నాయకులు దూరమవడం మరో షాక్‌గా చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి ఓటమి తర్వాత అడపాదడపా వచ్చి పోవడమే తప్పా, పార్టీకి పూర్తి సమయం కేటాయించలేదని బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు స్తబ్దుగా ఉండడంతో నాయకులు, కార్యకర్తలు ఎవరిదారి వారు చూసుకుంటున్నామని వాపోతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తాండూరు సెగ్మెంట్‌లో ఎన్నికల సభలను నిర్వహిస్తూ కార్యకర్తలు, నాయకులను ముందుకు నడిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి సభలు పెట్టలేదు.

రేపు జరిగే కార్యకర్తల సమావేశం వాయిదా

ఈ నెల 27న తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించింది. అయితే చివరి నిమిషంలో ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. గతంలో కూడా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తూ ఈ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని ప్రకటించారు. తర్వాత ఆ సమావేశాన్ని కూడా వాయిదా వేసి 27వ తేదీని నిర్ణయించగా అది మరో సారి వాయిదాపడడం చర్చనీయాంశంగా మారింది.



ఉత్సవాలు ముగియడంతో విగ్రహాలను పల్లకీలో మంకాల్ గ్రామానికి తీసుకెళ్తున్న భక్తులు

ముగిసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు

- గుట్టపై నుంచి మంకాల్‌కు ఉత్సవ విగ్రహాల తరలింపు

మహేశ్వరం, మార్చి 25 : ప్రసిద్ధ శ్రీనగర్ ఆదిలక్ష్మీ అలివేలుమంగ సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా వైభవంగా సాగిన తిరు కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆదివారం రాత్రి భక్తులు మంకాల్ గ్రామానికి పల్లకి ద్వారా ఊరేగింపుగా తీసుకెళ్లారు. నాలుగు రోజులు కల్యాణోత్సవాలను తిలకించేందుకు తుక్కుగూడ, మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు నగర శివారు ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. మాజీ హోం మంత్రి టి.దేవేందర్ గౌడ్ కుటుంబ సభ్యులు, భక్తులు ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ విజయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, మదుమోహన్‌గుప్తా, తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ నాలుగు రోజులుగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

త్వరలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయిస్తాం

మేడ్చల్ టౌన్, మార్చి 25: త్వరలోనే బీఆర్ ఎస్ పార్టీని ఖాళీచేయించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ ఎస్ నాయకులు సోమవారం పెద్దఎత్తున వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ఒంటెద్దు పోకడతో పదేళ్ల పాటు పరిపాలన కొనసాగించారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీలో విసుగుచెందిన కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. గుండ్లపోంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు నేడు తమ పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరుతున్న వారు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి విజయానికి కష్టపడి పనిచేయాలని కోరారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని పక్కనపెట్టి నేడు చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు తమ రాజకీయ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవటానికి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ప్రజాసేవ చేయదలచిన ప్రతీ ఒక్కరికి తమ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కండ్లకోయ మాజీసర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, స్వామి, రాజేందర్ ముదిరాజ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షహనాగౌస్ ఖాన్‌లతో పాటు 200మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య

పరిగి, మార్చి 25: ముదిరాజ్ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దోమ వెంకటయ్య, సందోళ్ల వెంకటయ్య, ఏదుల విజయ్‌కుమార్ , కార్యదర్శిగా జాలరి నర్సింహులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి బి.సంజీవ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బి.జగన్మోహన్‌ల చేతుల మీదుగా నియామకపు పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెపా లక్ష్య సాధనకు పనిచేస్తామని తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి మెపా పని చేస్తుందన్నారు. ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం కలిసి పని చేద్దామని అన్నారు.



వెంకటయ్యను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు



జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రాంభిస్తున్న బొగ్గారపు దయానంద్

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

- ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

ఇబ్రహీంపట్నం, మార్చి 25 : నైపుణ్యాన్ని పెంచుకుని విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని, అప్పుడే ఉద్యోగాలు సాధించడం సులభతరం అవుతుందని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. ఆదివారం రాత్రి ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభాగర్‌లో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదని వివిధ అంశాల్లో తగిన నైపుణ్యాన్ని పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణిస్తారన్నారు. చదువుతోపాటు హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో నిపుణులచే విద్యార్థులకు తగు శిక్షణ ఇస్తున్నామని కళాశాల చైర్మన్ డా.జి.నాగయ్య అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకనుగుణంగా ముందుకు పోవాలని విద్యార్థులకు సూచించారు. సింగర్లు అనుదీప్, లిప్సిక, గోవిందాచార్య వారి ఆట, పాటలతో విద్యార్థులను అలరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డా.డి.ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.పి.శేఖర్‌బాబు, డీన్ డా.కె.ఈశ్వర్ ప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ డా.సుబ్బారావు పాల్గొన్నారు.



శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజల్లో భక్తులు

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, మార్చి 25 : మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల మూడవ రోజు సోమవారం అర్చకులు నడదూర్ రామాచార్యులు, పరావస్తు గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, చక్రవర్తిఆ చార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ రాజమోని తిరుపతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్, పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

కడ్తాల్, మార్చి 25 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే ఘనవిజయమని, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అవకాశవాద మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని చెప్పారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, సత్యం, రాజేశ్, మంకిశ్రీను, పాల్గొన్నారు.



రాగమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

సొంతగూటికి చేరిన జడ్పీటీసీ

కొందుర్గు, మార్చి 25 : ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొందుర్గు జడ్పీటీసీ ఎదిరే రాగమ్మ తిరిగి సొంత గూటికి చేరారు. సోమవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంట్లో అయన బీఆర్‌ఎస్ కండువా కప్పి, ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. అనివార్య కారణాల వల్లే తాను కాంగ్రెస్‌లోకి వెళ్లాలని, తిరిగి బీఆర్‌ఎస్‌లోకి రావడంతో సొంత ఇంటికి వచ్చినట్టుగా ఉందని రాగమ్మ చెప్పారు. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతుండగా, ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఆమె తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరడంతో మండలంలో చర్చనీయాంశమయింది.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆదిభట్ల, మార్చి 25 : ఒకే చోట చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడి, క్షణం తీరిక లేకుండా గడుపుతున్న పాత స్నేహితులను హోలీ ఒక చోటికి చేర్చింది. 35 సంవత్సరాల తరువాత వారు హోలీ వేళ ఆత్మీయసమ్మేళనంలో కలుసుకొని గతంలోని గడిపిన ఆనంద క్షణాలను జ్ఞాపకం చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాదు పాతబస్తీ పలక్‌నామా, రాజన్నబావి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడగా, మరి కొందరు వ్యాపారం చేస్తున్నారు. వారు ఈ రోజు ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో కలుసుకున్నారు. ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై ఐదు సంవత్సరాల తరువాత హోలీరోజును ఎంచుకొని తాము కలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మతేజ, పద్మారావు,పండాల లక్ష్మీపతిగౌడ్, చంద్రశేఖర్, జైహింద్, హరికిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, రాజేందర్, విక్రమ్, వెంకటాద్రి, శేఖర్, శ్రీకాంత్, యాదగిరి, శ్రవణ్, రామారావులు పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో విషాదం..
బీఆర్‌ఎస్ నాయకుడిపై కత్తితో దాడి

- తృటిలో తప్పిన ప్రాణాపాయం
- ఆసుపత్రికి తరలించిన గ్రామస్తులు , బంధువులు
- కమాల్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

వికారాబాద్, మార్చి 25 : పాత కక్షలు మనసులో పెట్టుకుని, హోలీ వేడుకల్లో గ్రామ మాజీ సర్పంచ్‌పై కత్తితో దాడి చేసిన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ మండలం పరిధిలోని పులుసుమామిడి గ్రామానికి చెందిన నారేగూడం కమాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా, గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో కమాల్‌రెడ్డి వికారాబాద్‌లో నివాసం ఉంటూ గ్రామానికి వెళ్లి వస్తుంటారు. అయితే కమాల్‌రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొత్తగడి నాగిరెడ్డి, లలిత దంపతుల మధ్య గొడవలు తలెత్తాయి. లలిత బంధువులు ఏడాదిక్రితం గ్రామంలో పంచాయితీ పెట్టారు. సర్పంచ్ కావడంతో పాటు, గ్రామపెద్దగా కమాల్‌రెడ్డి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డిని మందలించడం, అదే సమయంలో లలిత బంధువులు నాగిరెడ్డిపై దాడి చేసే క్రమంలో తోపులాట జరిగింది. నాగిరెడ్డి కింద పడి చేయి విరిగింది. దీంతో కోపం పెంచుకున్న నాగిరెడ్డి కమాల్‌రెడ్డిని చంపుతానని గ్రామంలో చెప్పుకు తిరుగుతూ, అదను కోసం వేచిచూశాడు. హోలీ పండుగ సందర్భంగా కమాల్‌రెడ్డి స్వగ్రామానికి వెళ్లాడు. హోలీ ఆడుతుండగా నాగిరెడ్డి వచ్చి అతనిపై కత్తితో దాడి చేశాడు. కమాల్ రెడ్డి చేయి అడ్డు పెట్టడంతో చేతికి, మెడ భాగంలో గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు, బంధువులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి, ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి కుమారుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కమాల్‌రెడ్డి

పాంబండ ఆలయంలో
ఎమ్మెల్యే దంపతుల పూజలు

కులకచర్ల, మార్చి 25: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి ఉమారెడ్డితో కలిసి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి తన సొంత డబ్బుతో అమ్మవారికి చేయించిన వెండి కిరీటం, హన్మంత్‌రెడ్డి చేయించిన శ్రీరామలింగేశ్వరస్వామి వారికి బంగారు కళ్ళను ఎమ్మెల్యే ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు. పాంబండ దేవాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, దేవాలయ ఈవో సుధాకర్, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీఎంపీపీ అంజిలయ్యగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు జంగయ్య, కులకచర్ల ఎంపీటీసీ ఆనంద్, పార్టీ నాయకులు బాలముకుందం, సంజీవరెడ్డి, న్యాయవాది నర్సింహులు, రాహుల్‌నాయక్, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలోకి వెండి కిరీటంతో వెళ్తున్న పరిగి ఎమ్మెల్యే దంపతులు

అసహజ శృంగారం కోసం వేధింపులు...
వ్యక్తిపై హత్యాయత్నం

ఘట్‌కేసర్‌రూరల్, మార్చి 25 : అసహజ శృంగారం చేయమని నిత్యం వేధిస్తున్న వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లా మూన్‌రాయి తండాకు చెందిన భీమానాయక్ మేడ్చల్‌జిల్లా ఘట్‌కేసర్‌లో భార్యాపిల్లలతో ఉంటూ కూలీ పనులు చేసుకుంటాడు. వారం రోజుల క్రితం స్థానిక బస్టాండ్‌అవరణలో కొండాపూర్‌లోని ఓ డైయిరీలో పని చేస్తున్న బిహార్‌కు చెందిన మితేష్‌కుమార్(25) భీమానాయక్‌కు పరిచయమయ్యాడు. కూలీపనులు ఉన్నప్పుడు చెబుతా రావాలని యువకుడి వద్ద నుంచి భీమానాయక్ ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్ చేస్తూ అసహజ శృంగారం చేయాలని కోరాడు. మితేష్‌కుమార్ నిరాకరించడంతో అసభ్యంగా తిడుతూ చంపుతానని బెదిరింపులకు దిగాడు. రాత్రింబవళ్లు ఫోన్ చేస్తూ వేధింపులకు దిగడంతో ఏలాగైన భీమానాయక్‌ను చంపాలని పథకం వేశాడు మితేష్‌కుమార్. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం భీమానాయక్‌కు మితేష్‌కుమార్ ఫోన్‌చేసి తాను నివాసం ఉంటున్న కొండాపూర్‌లోని డెయిరీకి రావాలని, మద్యంతాగి హోమో సెక్స్ చేసుకుందామని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన భీమానాయక్ అక్కడి వెళ్లగా మద్యం తాగించి తన వద్దఉన్న కత్తితో భీమానాయక్ కడుపులో మూడు సార్లు పొడిచాడు. దీంతో తీవ్రరక్త గాయాలతో కేకలు వేస్తూ రోడ్డుపైకి వచ్చాడు. గమనించిన వాహనాదారుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితున్ని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితునిడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితుడు మితేష్‌కుమార్

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 25: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని కాచవానిసింగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం శామీర్‌పేటలోని ఈటల రాజేందర్ నివాసంలో బీజేపీలో చేరారు. ఈటల వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ మూడవసారి దేశప్రధాని కావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయని గుర్తుచేశారు. అవినీతిలేని పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. దేశంలో ఇండియా కూటమి తమకు ఎక్కడా పోటీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు దొరకడం లేదన్నారు. బీజేపీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, కార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, నాయకులు బసవ రాజుగౌడ్, నాయకులు అశోక్, శివరాజ్‌గౌడ్, రామకృష్ణ, రఘుగౌడ్, సత్యనారాయణ, వినయ్, మహేష్, నవీన్‌యాదవ్, వెంకటన్న, కిరణ్, ప్రశాంత్, అకాష్, రాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కాచవాని సింగారం బీఆర్‌ఎస్ నాయకులు

బీజేపీతోనే యువత భవిష్యత్తు

మేడ్చల్ టౌన్, మార్చి 25: కేంద్రంలో నరేంద్ర మోదీ మూడో సారి ప్రధాన మంత్రి అవుతేనే యువకులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని బండమాదారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఈటల రాజేందర్ కండువాకప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని అన్నారు. నేడు భారత్‌కు విశ్వగురువు ఖ్యాతిని తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీదన్నారు. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతీ యువకుడిపై ఉందన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి నేడు భారీఎత్తున ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారన్నారు. అన్నివర్గాలకు ప్రాధాన్యతనిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడుతున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్‌ఎస్ నాయకులు

బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలి

యాచారం, మార్చి 25 : యాచారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్టాండ్‌లో సీసీ రోడ్డు లేకపోవడంతో దుమ్ము, దూళి మీద పడి ఇబ్బంది పడుతున్నామని పలువురు ప్రయాణికులు చెప్పారు. బస్సుల రాకపోకల సందర్భంగా లేచే దుమ్ము తమ ఇళ్లు, షాపుల్లోకి వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. యాచారం గ్రామ పంచాయతీ, జడ్పీ నిధుల, ఎంపీ నిధుల నుంచి బస్టాండ్‌లో సీసీ రోడ్డు వేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరేందర్ రెడ్డితో ప్రస్తావించగా బస్టాండ్‌లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం సుమారుగా రూ.16లక్షల వ్యయమవుతుందన్నారు.



యాచారం బస్టాండ్

ప్రత్యేక అలంకరణలో
వేంకటేశ్వరస్వామి

కొడంగల్, మార్చి 25: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మదినం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి ఆస్థాన మండపంలో తిరుచ్చిపై వేంచేపు చేసి పూలమాలలతో అలంకరించారు. దేవస్థానం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



31న దేవుని పడకల్ లో
అంతర్ రాష్ట్ర బండ లాగుడు పోటీలు

తలకొండపల్లి , మార్చి 25 : తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 31న అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే బండలాగుడు పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండవ బహుమతి రూ.75,116, మూడవ బహుమతి రూ.50,116, నాలుగవ బహుమతి రూ.30,166, ఐదవ బహుమతి రూ. 20,116తో పాటు ప్రోత్సాహక బహుమతులు రూ.8,116 లచొప్పున అందజేయడం జరుగుతుందని చెప్పారు. పోటీల ప్రారంభానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి , మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచందర్‌రెడ్డి, గుర్కా జైపాల్ యాదవ్, తదితర నాయకులు హాజరవుతారని ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.





పులుమామిడి పంచాయతీ భవనం ముందు పడేసిన కంకర, చెత్తచెదారం

పంచాయతీ ఎదుట కంకర,చెత్త చెదారం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు

వికారాబాద్, మార్చి 25: నవాబుపేట మండలంలోని పులుమామిడి గ్రామ పంచాయతీ భవనం ముందు కంకర, చెత్త చెదారంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియండతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఖాకీలకు కష్టకాలం

- బడ్జెట్ పద్దులపై పోలీసు ఉద్యోగుల్లో చర్చ
- చెల్లింపులకు ఈ ఏడాది ఐదు రోజులే గడువు
- ఇతర జిల్లాలో విడుదల
- సీఎం సొంత జిల్లాలో పెండింగ్

తాండూరు: మార్చి 25: పోలీస్ శాఖలో పని చేసే ఉద్యోగులకు బడ్జెట్ బిల్లులు వస్తాయో, రావో అన్న భయం పట్టుకుంటుంది. మార్చి 31వ తేదీతో బడ్జెట్ పద్దుల చెల్లింపు గడువు ముగుస్తోంది. బడ్జెట్‌పద్దుల కింద వచ్చే చెల్లింపు గడువు ఇంకా ఐదు రోజులే మిగిలి ఉంది. దీంతో ప్రభుత్వం ఇప్పటికైనా చెల్లింపు చేసేలా చూడాలని వికారాబాద్ జిల్లా పోలీసులు కోరుతున్నారు. ఈ ఏడాది పోలీసు శాఖలో సరెండర్ బిల్స్, 11నెలల టీఏ బిల్స్, డీఏ ఎరియన్స్, గత పీఆర్‌సీ ఏరియన్స్, మెడికల్ బిల్లులతో పాటు పలు రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ పోలీస్ శాఖలో బడ్జెట్ పద్దుల కింద ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే, ఇంకా బిల్లులు చెల్లించలేదు. ఇంటి అద్దెలు, వ్యక్తిగత కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు, ఈఎంఐలు చెల్లించడానికీ ఇబ్బందిగా మారిందని పలువురు పోలీసులు వాపోతున్నారు.

పోలీసుల వివరాలు..

వికారాబాద్ జిల్లాలో వెయ్యి మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. మరో 110మంది పోలీస్ అధికారులు ఉన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1110 మంది పోలీసులు ఉన్నారు. వీరందరికీ బడ్జెట్ కింద మంజూరయ్యే టీఏ, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లను ఈ ఏడాది (2023-24) ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



మంత్రుల జిల్లాలో మంజూరు..
సీఎం జిల్లాలో పెండింగ్

మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేష్, పొన్నం ప్రభాకర్‌లు తమ తమ జిల్లాలోని ఉద్యోగసంఘాలు, ఉద్యోగులు, పోలీసులకు పెండింగ్ బిల్లుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడి బిల్లులను మంజూరు చేయించారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లాలో మాత్రం చెల్లింపులు ఇంకా కాకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానిక పోలీసులు చెబుతున్నారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అంటున్నారు. అయితే ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో స్థానిక పోలీసులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా వికారాబాద్ జిల్లాలో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని పోలీసులు, ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఊరూ.. వాడ.. ఉత్సాహంగా హోలీ

● చెడుపై విజయానికి ప్రతీకగా కామదహనం

● చిన్నా పెద్దా తేడా లేకుండా సంబరాలు

ఆమనగల్లు /కడ్తాల్ / తలకొండపల్లి, మార్చి 25 : రంగుల పండుగ హోలీ వేడుకలు ఆమనగల్లు పట్టణంతో పాటు కడ్తాల్, తలకొండపల్లి, మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఊరు వాడా చిన్నా, పెద్దా తేడా లేకుండా, కులమతాలకు అతీతంగా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, వ్యాపారస్థులు, ప్రజలు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. మహిళలు,యువతులు ఆట, పాటలతో హోలీ శుభాకాంక్షలు తెలుపుకొని రంగులు చల్లుకున్నారు. కాగా ఆదివారం రాత్రి మండలంలోని గ్రామాల్లో కామదహనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్సై బాల్‌రామ్‌నాయక్, వరప్రసాద్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

షాద్‌నగర్ : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి కాముడి దహనం చేశారు. సోమవారం ఉదయం నుంచే యువత నుంచి పెద్దల వరకు రంగులు చల్లుకుంటూ డప్పు, బ్యాండ్, డీజేలతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అని చెప్పారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

షాబాద్ : షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద భేదం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మన జీవితాల్లో సంతోషాన్ని వికసించే వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ రంగుల హోలీ అందరికి ఆనందాన్ని పంచాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చేవెళ్ల : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలను చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రధన కూడళ్లలో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆదివారం రాత్రి గ్రామాల్లో కామ దహనం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.

మంచాల : మంచాల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో హోలీ సంబరాలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే చిన్నారులు, యువతీయువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరుట్లలో జరిగిన హోలీ సంబరాల్లో ఎంపీటీసీ చీరాలరమేష్, చిందం రఘుపతి, గుడ్డిమల్లచంద్రయ్య, పాండాలజంగయ్య, నర్సింహారెడ్డి, పెద్దిరెడ్డి యాదగిరిరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



ఆరుట్లలో సంబురాలు చేసుకుంటున్న యువకులు



చౌదరిగూడలో హోలీ వేడుకల్లో గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ సహా మండంలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు, పెద్దలు, యువత, ఈ వేడుకల్లో పాల్గొని రంగులు చల్లుకున్నారు. కోలాహలం కనిపించింది.

యాచారం : యాచారం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రజలు హోలీని ప్రశాంతంగా జరుపుకున్నారు. కులమతాలకతీతంగా యువత రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు. యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వివిధ గ్రామాల్లో కామదహనం చేశారు. కాగా హోలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాచారం సీఐ శంకర్‌కుమార్, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు మెట్రోలింగ్ నర్వహిస్తూ నిఘా వేశారు. ఒంటి గంట తరువాత హోలీ ఆడొద్ధని చెప్పారు.



మొయినాబాద్‌లో వేడుకల్లో చిన్నారులు

కొందుర్గు : కొందుర్గు మండల వాసులు హోలీని సోమవారం ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి కామదహనం చేశారు. సోమవారం ఉదయం నుంచే ఒకరిపై ఒకరు రంగులను చల్లుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా సంతోషంతో రంగులను పూసుకున్నారు.డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యాలు చేశారు. వివిధ పార్టీల నాయకులు రంగులను చల్లుకొని శుభాకాంక్షలు తెలిపారు.

చేవెళ్ల : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో సోమవారం హోలీ సాంప్రదాయ బద్ధంగా ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి వివిధ బస్తీల్లో ప్రజలు కామదహనం, పూజలు చేశారు. ఉదయాన్నే యువకులు కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందంగా హోలీ జరుపుకున్నారు. మున్సిపల్ కేంద్రంలోని వివిధ బస్తీల్లో ఉన్న హాస్టళ్ల వద్ద విద్యార్థులు హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి ఇంటి వద్ద హోలీ వేడుకలు జరిగాయి. సిరి స్వచ్ఛందసంస్థ సభ్యులతో పాటు స్థానిక నాయకులతో కలసి ఆమె వేడుకల్లో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సోమవారం హోలీని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అన్ని వర్గాల ప్రజలు హోలీ సందర్భంగా రంగులు పూసుకున్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : షాద్‌నగర్ పట్టణంలో సోమవారం హోలీ సంబురాన్ని ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద, కుల, మతాలకు అతీతంగా ఉత్సవంలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు సైతం ఆనందంగా రంగోలిలో పాల్గొన్ని ఆనందించారు. ఆదివారం రాత్రి కామదహనం చేసి, సంబుర పడ్డారు. వంశోద్ధరణ కోసం మర్వాడీలు సోమవారం దూండ్ సంబురాన్ని జరుపుకున్నారు. హోలీ పర్వదినాన్ని పురష్కరించుకుని ఏడాది లోపు మగ బిడ్డ ఉన్న ప్రతి ఇంటా దూండ్ ఉత్సవాన్ని నిర్వహించుకుంటారు. రాజస్థాని సేవా సంఘ్ షాద్‌నగర్‌శాఖ అధ్యక్షుడు కైలాస్‌చౌదరి ఆధ్వర్యంలో స్థానిక కమల్‌కిషోర్‌శర్మ, శంకర్‌లాల్ లాహోటి, కైలాస్‌చౌదరి, అమృత్‌లాల్‌సోని ఇళ్లలో దూండ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్వాడీలందరు సాంప్రదాయ దుస్తులు దరించి, రంగులు చల్లుకుని పసి బిడ్డలు ఉన్న ఇళ్ళకు వెళ్లి, చిన్నారులను ఆశీర్వదిస్తూ, ఆడిపాడారు. భజ్‌రంగ్‌లాల్, గజానంద్, శ్యాంజువార్, హోంప్రకాష్, కృష్ణ, భవర్‌లాల్, మంగ్లీరాం, బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : మున్సిపాలిటీతో పాటు, మండలంలో హోలీ పండుగ సంబురాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. యువతీ, యువకులు మేళాతాళాలతో ఉరేగింపులు నిర్వహించి రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు.

చేవెళ్ల : చేవెళ్ల నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో హోలి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం హోలి సందర్భంగా చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో ప్రజలు హోలీని కనుల పండువగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో యువత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకుని వేడుకలను ఉత్సహంగా నిర్వహించుకున్నారు. మహిళలు, చిన్నారులు కూడా ఉత్సహంగా హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో సోమవారం రాత్రి కాముని దహనం నిర్వహించారు. హోళిపండుగ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చేవెళ్ల సీఐ. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శంకర్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగారు. యువకులు, మహిళలు సంతోషంగా వేడుకలను జరుపుకున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు కూడా సంబరాల్లో పాల్గొన్నారు.



శంషాబాద్‌లో హోలీ ఆడుతున్న యువకులు



కామదాహనం చేస్తున్న కొందుర్గు గ్రామస్థులు



కందుకూరులో రంగులు పూసుకున్న యువత



చిన్నసోలిపేట్‌లో సంబురాల్లో యువకులు



కొత్తూరు : సంబురాల్లో గ్రామస్థులు



ఆమనగల్లులో హోలీ వేడుకల్లో మహిళలు



షాద్‌నగర్ : హోలీ సంబురాల్లో మార్వాడీలు



ఇబ్రహీంపట్నంలో చిన్నారుల సంబురాలు

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు కిరాణం షాపు దగ్ధం



షాపులో చెలరేగుతున్న మంటలు

చేవెళ్ల, మార్చి 25 : ప్రమాదవశాత్తు శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ మంజునాథ కిరాణం షాపు దగ్ధమయింది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఆ షాపులో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమయింది. చేవెళ్ల నుంచి ఫైర్ ఇంజన్ మంటలు ఆర్పేందుకు శంకర్‌పల్లికి వచ్చేలోపే షాపులోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఆ షాపు పక్కన ఉన్న ఫర్టిలైజర్ దుకాణానికి మంటలు వ్యాపించకుండా మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 10 లక్షల నష్టం సంభవించడంతో ఆ కిరాణం షాపు యజమాని బుచ్చిరెడ్డి, కుటుంబసభ్యులు విలపించారు. షార్ట్ సర్క్యూట్ తోనే జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ఆల్ప్రాజోలం పట్టివేత.. నిందితుల అరెస్ట్

● కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం



పోలీసులకు పట్టుబడ్డ ఆల్ప్రాజోలం

కొత్తూర్, మార్చి 25 : కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పారిశ్రామిక వాడలో ఆదివారం రాత్రి ఎస్వోటీ పోలీసులు దాడి చేసి కల్లులో కలిపే నిషేదిత ఆల్ప్రాజోలంను పట్టుకున్నారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు కథనం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలం వెలిగిచర్లకు చెందిన అనిల్‌గౌడ్, మహబూబ్‌నగర్ టౌన్‌కు చెందిన సుధాకర్, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం నేరెళ్లపల్లికి చెందిన శరత్‌బాబులు ముఠాగా ఏర్పడి కల్లులో కలిపే నిషేధిత ఆల్ప్రాజోలంను దొంగచాటుగా విక్రయిస్తూ, అక్రమ సంపదనకు అలవాటుపడ్డారు. నాగర్‌కర్నూల్, జడ్చర్ల, హైదరాబాద్‌లో ఆల్ప్రాజోలంను విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కారులో సుమారు ఒక కిలో ఆల్ప్రాజోలంను తరలిస్తుండగా శంషాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. దాని విలువ రూ.10లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు. ముగ్గురు నిందితులతో పాటు, కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

బోర్‌వెల్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి వలస కార్మికుడి మృతి

చేవెళ్ల, మార్చి 25 : బోర్‌వెల్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఓ నిండు ప్రాణం పోయిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బామన్‌పోయామి(19) మూడు నెలల క్రితం తన స్నేహితులతో కలిసి చేవెళ్లకు బతుకు దెరువు నిమిత్తం వచ్చాడు. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర బోర్‌వెల్స్‌లో లేబర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఎప్పటి మాదిరిగానే ఈనెల 24న ఉదయం తెల్లవారు జామున చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎదిరే యాదయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో బోరు వేయడానికి వెళ్లాడు. అక్కడ బోరు వేస్తుండగా బామన్ పోయామికి నిద్ర వస్తుందని అక్కడే కొద్ది దూరంలో వ్యవసాయ పొలంలోనే పడుకున్నాడు. ఇది గమనించని లారీ డ్రైవర్ సురకంటి రవీందర్‌రెడ్డి బోర్ లారీని నిద్రిస్తున్న బామన్ పోయామిపై ఎక్కించాడు. దీంతో బామన్‌పోయామి అక్కడిక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులు బామన్ పోయామి మృతదేహన్ని చూసి బోరున విలపించారు. అతని తోటి కార్మికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్పష్టం చేశారు.

తాగడానికి భార్య డబ్బులివ్వడం లేదని భర్త ఆత్మహత్య

షాద్‌నగర్, మార్చి 25 : తాగడానికి భార్య డబ్బులు ఇవ్వలేదని రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం కేశంపేట మండలం అవాజ్ మియాపడకల్ గ్రామానికి చెందిన వారణాసి ఆంజనేయులు(50) తన భార్యా సుశీలమ్మ, పిల్లలతో కలిసి పదిహేను రోజుల క్రితం షాద్‌నగర్‌కు వచ్చి రాంనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. తాగుడుకు బానిసైన అతను సోమవారం తాగడానికి తన భార్యను డబ్బులు అడుగగా ఆమె లేవని చెప్పడంతో చటాన్‌పల్లి శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ రఘురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెప్పారు.

బెల్ట్‌షాపులపై ఎస్వోటీ దాడులు



కడ్తాల్ : స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కడ్తాల్, మార్చి 25 : కడ్తాల్ మండలంలోని ఎక్వాయ్‌పల్లి గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్‌షాపులపై సోమవారం సాయంత్రం శంషాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు చేసి మద్యం పట్టుకున్నారు. బద్రిపల్లిపర్వతాలు, శ్రీను వారి కిరాణం దుకాణాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. ఈ సమాచారమందుకున్న ఒస్వోటీ పోలీసులు దాడులు చేసి పర్వతాలు దుకాణంలో రూ. లక్ష విలువైన మద్యాన్ని, శ్రీను దుకాణంలో రూ.18వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో పాటు ఇరువురు నిందితులను కడ్తాల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

యాచారం : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో ఎల్బీనగర్ ఎస్వోటీ పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు చేసి బక్క వెంకటేష్ అనే వ్యక్తి ఇంట్లో అనుమతి లేకుండా నిల్వ చేసిన రూ.23వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమాచారమందడంతో ఎస్వోటీ పోలీసులు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేవెళ్ల : అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న కిరాణా షాపులపై రాజేంద్రనగర్ ఎస్వోటీ, చేవెళ్ల పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలోని మల్లేశ్ కిరాణం షాపులో అనుమతి లేకుండా అమ్ముతున్న 9.27 లీటర్లు, కందవాడ గ్రామంలోని జై శ్రీరాం కిరాణం షాపులో 6.3 లీటర్లు, శివపార్వతి కిరాణంషాపులో 5.33 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై చెప్పారు.

ఎంపీ టికెట్ కేటాయించాలని ర్యాలీ



బైక్ ర్యాలీలో అల్లు అర్జున్ అభిమానులు

ఇబ్రహీంపట్నం, మార్చి 25 : కాంగ్రెస్ నేత డా.కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డికి భువనగిరి ఎంపీ టికెట్‌ను ఇవ్వాలని సోమవారం ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ అభిమానులు ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కే. చంద్రశేఖర్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో ఉన్నారని అన్నారు. నిస్వార్థంగా పనిచేసే ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు చెప్పారు.

మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింగ్‌రావు



నర్సింగ్‌రావు

ఘట్‌కేసర్, మార్చి 25: జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని కొర్రెములకు చెందిన చిప్పల నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిప్పల నర్సింగ్‌రావు మాట్లాడుతూ మాలల అభ్యున్నతికి నిరంతరం కృషిచేయనున్నట్లు నర్సింగ్‌రావు తెలిపారు.ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. తనను జాతీయ మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు దన్యవాదాలు తెలిపారు.

నేడు సొసైటీ సర్వసభ్య సమావేశం

యాచారం, మార్చి 25 : యాచారం మండల సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 26న మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరుగబోతుందని సొసైటీ సీఈవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సొసైటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు హాజరు కావాలని చెప్పారు.


మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

కడ్తాల్, మార్చి 25 : మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని కాంగ్రెస్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మసీదులో ప్రార్థన అనంతరం వారికి పండ్లు అందజేసి ఉపవాసాన్ని విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం కంటే మానవత్వం గొప్పదనేదే అన్ని మతాల సారాంశమని చెప్పారు. ముస్లిం, మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విఠలయ్యగౌడ్, జనార్ధన్‌గౌడ్, పారేశం, ముస్లిం పెద్దలు ఎండీ. పాష, లాయక్‌అలీ, బాబా, ఖయ్యూం, మహ్మద్, అనీఫ్ తదితరులు, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్.. పొంచి ఉన్న ప్రమాదం..



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 25 : షాద్‌నగర్ పట్టణంలోని మరియారాణి పాఠశాల రోడ్డులో గల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలింది. దాని పక్కన ఎత్తుగా మట్టి పోయడంతో ట్రాన్స్‌పార్మర్ రోడ్డుకు సమానమై ప్రమాదకరంగా మారింది. దాన్ని మార్చడానికి కొన్నాళ్ల క్రితమే సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేసిన ట్రాన్స్‌కో అధికారులు మార్చడం మరిచారు. దానికి ఎటువంటి ఫెన్సింగ్ లేకపోవడంతో గమనించకుండా అటుగా వెళ్లే మూగ జీవాలు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు వెంటనే ట్రాన్స్‌పార్మర్‌ను కొత్త దిమ్మెపైకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 25 : విద్యార్థులు ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఇవోక్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ జితేంద్ర వంగ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ఐటీ నియామకాలు- కార్పొరేట్ దృక్పథంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్పొరేట్ సంస్థల్లో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక విప్లవానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. నూతన పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువాలని, అప్పుడే ఈ పోటీ ప్రపంచంలో నిలబడగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఎస్‌సీ హెచ్‌వోడీ విష్ణుమూర్తి, డీన్ విజయ్‌కుమార్, శంకర్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం

● అక్నాపూర్ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్



అజయ్‌కుమార్

వికారాబాద్, మార్చి 25: బీఆర్ఎస్ పార్టీ తరఫున చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అక్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ గతంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు నవాబుపేట మండలానికి అధిక సంఖ్యలో నిధులు మంజూరు చేయించి మండల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు ముదిరాజ్‌ల మద్దతు ఉండటంతో పాటు పట్టు ఉన్న వ్యక్తి అన్నారు. చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ ఎంపీ గెలుపొందడం ఖాయమన్నారు.